సూపర్ ఎల్‌నినో వచ్చినా విద్యుత్ కొరత రావొద్దు

2

ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

అక్టోబర్ 23 శుక్రవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 14 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

FRIDAY OCTOBER 23 2026 | VOL:1 | ISSUE: 14 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

బీసీ కులగణనలో తప్పులుంటే సరిచేస్తాం.. సీఎం రేవంత్ కీలక ప్రకటన

- వివరాలు నమోదు కానివారు ప్రభుత్వానికి తెలియజేయాలని సూచన
- వచ్చే కేబినెట్‌లో కులగణన లెక్కలపై చర్చ
- ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- ముదిరాజ్ నాయకులకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని హామీ
- పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాల ఏర్పాటుకు హామీ



బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావిస్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు.తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు.తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్‌హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఒకే 'ఫెయిల్డ్ ప్రొడక్ట్'ను పదేపదే లాంచ్ చేస్తున్నారు: కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు

- విదేశాలకు వెళ్లి దేశ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారు
- కాంగ్రెస్‌పై ఇప్పుడు ఐడియలాజికల్ నక్సల్స్ ప్రభావం ఉందన్న మోదీ
- భారత ప్రజలు 'మేము చేసి చూపిస్తాం' అనే స్ఫూర్తితో ఉన్నారు
- వికసిత భారత్ లక్ష్యమని పునరుద్ఘాటించిన ప్రధాని

కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తమ నాయకుడి వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ విదేశీ గడ్డపై దేశ ప్రతిష్ఠను దిగజార్చుతోందని, అంతర్జాతీయ శక్తుల జోక్యాన్ని కోరుకుంటోందని

(మిగతా 2వ పేజీలో..)



డిండికి నీటి తరలింపు ఆపండి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

- డిండి ప్రాజెక్టుకు పాలమూరు నుంచి నీటి తరలింపును ఆపాలని విజ్ఞప్తి
- ప్రత్యామ్నాయ మార్గంలో డిండికి నీరు సరఫరా చేయాలని సూచన
- అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ

డిండి ప్రాజెక్టుకు పాలమూరు

(మిగతా 2వ పేజీలో..)





ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం: 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు

- హైదరాబాద్‌లో ఘనంగా జరిగిన అలయ్ బలయ్ వేడుకలు
- ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించిన వెంకయ్యనాయుడు
- ఐక్యతను చాటిన సాంస్కృతిక సమ్మేళనమని వక్తుల ప్రశంస

ప్రకృతితో సామరస్యంగా జీవించడం అత్యంత ఆవశ్యకమని, ప్రకృతి వైపరీత్యాలను నివారించడం సాధ్యం కాదని మాజీ ఉపరాష్ట్రపతి

(మిగతా 2వ పేజీలో..)

మంత్రులు, ఎమ్మెల్యేల కార్లకు ధరల పరిమితి.. తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

- తమిళనాడులో మంత్రులు, ఎమ్మెల్యేల అధికారిక వాహనాలపై ధరల పరిమితి
- మంత్రులకు రూ. 26 లక్షలు, ఎమ్మెల్యేలకు రూ. 15 లక్షలుగా గరిష్ఠ ధర
- పదవి కోల్పోతే వాహనాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించాలన్న నిబంధన
- ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ పోర్టల్ ద్వారానే కొనుగోలు చేయాలన్న ప్రభుత్వం
- ఏటా వాహనాల కొనుగోలు ధరల పరిమితిపై 5 శాతం పెంపునకు అవకాశం



తమిళనాడు ప్రభుత్వం మంత్రులు, శాసనసభ్యులకు కేటాయించే అధికారిక వాహనాల కొనుగోలుపై కొత్త నిబంధనలను అమల్లోకి తీసుకువచ్చింది. మంత్రులు, ఇతర సీనియర్ ప్రజాప్రతినిధులకు రూ. 26 లక్షల వరకు, ఇతర ఎమ్మెల్యేలకు రూ. 15 లక్షల వరకు గరిష్ఠ ధర పరిమితిని విధిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శాసనసభ్యుల ప్రయాణ భత్యం నిబంధనలను సవరిస్తూ కొత్త గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.నూతన నిబంధనల ప్రకారం.. మంత్రులతో పాటు స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రతిపక్ష నాయకుడు, ప్రభుత్వ చీఫ్ విప్‌ల కోసం కొనుగోలు చేసే వాహనం ధర రూ. 26 లక్షలకు మించకూడదు. మిగతా ఎమ్మెల్యేలందరికీ ఈ పరిమితిని రూ. 15 లక్షలుగా నిర్ణయించారు. ఈ గరిష్ఠ ధరలోనే వాహనం ఎక్స్-షోరూమ్ ధర, పన్నులు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మోటారు ఇన్సూరెన్స్ ప్రీమియంలు కలిసి ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే, ఏటా ఈ ధరల పరిమితిపై 5 శాతం పెంపునకు కూడా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.వాహనాల కొనుగోలును కేంద్ర ప్రభుత్వానికి చెందిన "గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్" (GeM) పోర్టల్ ద్వారానే చేపట్టాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కొనుగోలు చేసే వాహనాలు తప్పనిసరిగా భారత్ స్టేజ్-VI (BS-VI) ఉద్గార ప్రమాణాలకు

(మిగతా 2వ పేజీలో..)




సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

- తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ
- రాష్ట్ర సాధనలో కళాకారుల పాత్రను కొనియాడిన కేటీఆర్
- వేడుకల విజయవంతానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ
- పాల్గొననున్న 33 జిల్లాలకు చెందిన జానపద కళాకారులు

సిరిసిల్లలో త్వరలో నిర్వహించనున్న 'జానపద జాతర' కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. తెలంగాణ జానపద పరిశ్రమ ఆధ్వర్యంలో ఈ వేడుకను సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో

(మిగతా 2వ పేజీలో..)



ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ ఎంట్రీ.. తొలి పోస్ట్ ఏంటంటే..!

- తన కొత్త పుస్తకం తొలి కాపీని పంచుకున్న సోనియా
- ప్రేమ, బాధ్యత, నష్టాలు, తనకంటూ ఓ స్థానం వెతుక్కున్న ప్రయాణం అని వ్యాఖ్య
- పుస్తకంలో రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం ప్రస్తావన
- నవంబరు 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తొలిసారి ఇన్‌స్టాగ్రామ్‌లో అడుగుపెట్టారు. తన రాబోయే పుస్తకం 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' అభిమానులతో పంచుకున్నారు. ప్రేమ, బాధ్యత, నష్టాలు, తనకంటూ ఓ స్థానం వెతుక్కున్న


(మిగతా 2వ పేజీలో..)

'నోబెల్' రాలేదని అసంతృప్తి.. ఇప్పుడు 'పులిట్జర్' పైన కూడా!

- తనకు పులిట్జర్ రావాల్సిందని ట్రంప్ వ్యాఖ్య
- నోబెల్ శాంతి బహుమతి కూడా రాలేదని అసంతృప్తి
- రష్యా దర్యాప్తు కథనాలు తప్పుగా ఉన్నాయని ఆరోపణ

(మిగతా 2వ పేజీలో..)





మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు.. రాహుల్‌పై అమిత్ షా ఫైర్

- నిరసనల వేళ విదేశీ పర్యటనకు వెళ్లిన రాహుల్‌పై అమిత్ షా తీవ్ర విమర్శలు
- జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకునేందుకే రాహుల్ విదేశాలకు వెళ్లారన్న సంబిత్ పాత్రా
- నిరసనలు కాదు.. గెలిచిన చోట ప్రణాళికలు చూపాలని విపక్షాలకు షా హితవు

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మరో మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదని జోస్యం చెప్పారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై ఇండియా కూటమి దేశవ్యాప్త నిరసనలు చేపట్టిన తరుణంలో రాహుల్ విదేశాల్లో ఉండటాన్ని బీజేపీ లక్ష్యంగా చేసుకుంది.ఢిల్లీలో యమునా నది ప్రక్షాళనకు

(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఒకే 'ఫెయిల్డ్ ప్రొడక్ట్'ను పదేపదే లాంచ్ చేస్తున్నారు: కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. గురువారం ఎన్డీటీవీ నిర్వహించిన 'వరల్డ్ సదస్సు'లో పాల్గొన్న సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ తన 'ఫెయిల్డ్ ప్రొడక్ట్'ను పదేపదే లాంచ్ చేసేందుకు ప్రయత్నిస్తోందని మోదీ ఎద్దేవా చేశారు. పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ.. "దేశవ్యాప్తంగా జరిగే లాంచింగ్‌ల కంటే ఎక్కువగా ఒకే నాయకుడిని లాంచ్ చేయడానికి కాంగ్రెస్ శ్రమిస్తోంది. ద్రాక్ష పళ్లు పుల్లన అంటే ఇదేనేమో" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్‌లోని ఒకే కుటుంబం ఆ పార్టీకి భారంగా మారిందని, ఈ విషయం సీనియర్ నేతలకు తెలిసినప్పటికీ వారు మౌనం వహిస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం 'ఐడియలాజికల్ నక్సల్స్' (భావజాల నక్సల్స్) గుప్పిట్లోకి వెళ్లిపోయిందని, ఒకప్పుడు అడవుల్లో విధ్వంసం సృష్టించిన వారు ఇప్పుడు దేశ వినాశనానికి ప్రణాళికలు రచిస్తున్నారని మోదీ సంచలన ఆరోపణలు చేశారు. దీనివల్ల కాంగ్రెస్ తన స్వతంత్ర ఆలోచనా శక్తిని కోల్పోయిందని విమర్శించారు. ప్రతిపక్షంలో ప్రతిభావంతులైన యువ ఎంపీలు ఉన్నప్పటికీ, కేవలం ఒక్క వ్యక్తికే ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రజాస్వామ్యానికి తీరని నష్టం జరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత ప్రజలు మాత్రం 'మేము ఏదైనా సాధించగలం' అనే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారని, 140 కోట్ల మంది భారతీయుల ఆత్మవిశ్వాసమే దేశానికి అతిపెద్ద బలమని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధిస్తామని ఆయన పునరుద్ఘాటించారు.

సిరిసిల్ల జానపద జాతరకు కేటీఆర్‌కు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు.ఈ మేరకు తెలంగాణ జానపద పరిశ్రమ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, ఇతర కార్యవర్గ సభ్యులతో కలిసి కేటీఆర్‌ను కలుసుకొని ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ కళాకారులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, జానపద కళలను కాపాడటంలో కళాకారులు చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో జానపద కళాకారులు తమ పాటలు, ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం నింపారని, మలిదశ ఉద్యమంలో వారి పాత్ర ఎంతో కీలకమని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ జానపద జాతరలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి కళాకారులు పాల్గొని తమ కళలను ప్రదర్శించనుండటం అభినందనీయమన్నారు. తెలంగాణ గొప్ప జానపద వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల విజయవంతానికి తన పూర్తి సహకారం అందిస్తానని ఆయన నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

మంత్రులు, ఎమ్మెల్యేల కార్లకు ధరల పరిమితి.. తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా ఉండాలి. మంత్రులకు కేటాయించే వాహనాలను తమిళనాడు ప్రభుత్వం తన పేరుపైనే కొనుగోలు చేస్తుంది. స్పీకర్, ఇతర శాసనసభ్యుల వాహనాల కొనుగోలు ప్రక్రియను అసెంబ్లీ సచివాలయం పర్యవేక్షిస్తుంది.మంత్రులు తమ పదవీకాలం ముగిసినప్పుడు, అనర్హత వేటుకు గురైనప్పుడు లేదా ఇతర కారణాలతో పదవిని కోల్పోయినప్పుడు తమకు కేటాయించిన వాహనాలను ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. స్పీకర్, ఇతర ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే, సాధారణ ఎమ్మెల్యేలు తమకు కేటాయించిన వాహనాల నిర్వహణ, మరమ్మతులు, ఇంధనం, డ్రైవర్ వేతనాల ఖర్చును వారికి చెల్లించే వాహన భత్యం నుంచే భరించాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధుల వాహన అర్హతలు, కొనుగోలు ప్రక్రియ, పరిపాలనా బాధ్యతలపై స్పష్టతనిస్తూ పబ్లిక్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ ఇ. సుందరవల్లి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్టాగ్రామ్‌లోకి సోనియా గాంధీ ఎంట్రీ.. తొలి పోస్ట్ ఏంటంటే..!

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణం ఇందులో ఉంటుందని వెల్లడించారు. ఈ పుస్తకం నవంబరు 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.544 పేజీల ఈ పుస్తకంలో సోనియా తన వ్యక్తిగత జీవితంలోని కీలక ఘట్టాలను వివరించనున్నారు. 1965లో ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్‌లో విద్యార్థినిగా ఉన్నప్పుడు రాజీవ్ గాంధీని కలుసుకోవడంతో ఈ కథ మొదలవుతుంది. 1968లో వీరి వివాహం జరిగింది. అనంతరం సోనియా భారత్‌కు వచ్చి కొత్త జీవితాన్ని ప్రారంభించారు. ఇటలీలో గడిపిన రోజులు, నెహ్రూ-గాంధీ కుటుంబంలోకి అడుగుపెట్టడం, అత్త ఇందిరా గాంధీతో పరిచయం, భారతీయ జీవనశైలికి అలవాటు పడిన తీరును ఈ పుస్తకంలో ప్రస్తావించారు.


మీకు ముంబై నచ్చదా? కాంగ్రెస్ విమర్శలపై జైశంకర్ కౌంటర్

ముంబైలో అమెరికా మంత్రితో భేటీపై కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన జైశంకర్

ఇందిరా గాంధీ, సల్మాన్ ఖుర్షీద్‌ల భేటీలను గుర్తు చేసిన వైనం

ఢిల్లీ బయట సమావేశాలు దశాబ్దంగా జరుగుతున్నాయని వెల్లడి

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో ముంబైలో భేటీ కావడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఈ విమర్శల వెనుక ఉన్న ఆంతర్యాన్ని తాను అర్థం చేసుకోలేకపోతున్నానని వ్యాఖ్యానిస్తూ.. "విపక్షాలకు ముంబై అంటే ఇష్టం లేదా? లేక ముంబై నగరానికే వారంటే పడదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు.గురువారం ఎన్డీటీవీ నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న జైశంకర్.. ముంబై భేటీని 'సమన్లు జారీ చేయడం'గా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభివర్ణించడాన్ని తప్పుబట్టారు. ఇటువంటి సున్నితమైన అంశాలపై పరిణతితో కూడిన చర్చలు జరగాలని ఆయన సూచించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనూ ఢిల్లీ వెలుపల అనేక దౌత్య సమావేశాలు జరిగాయని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పాక్ నేత జుల్ఫికర్ అలీ భుట్టోతో చర్చల నిమిత్తం అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ సిమ్లా వెళ్లిన విషయాన్ని, అలాగే పాక్ ప్రధానితో సమావేశం కోసం సల్మాన్ ఖుర్షీద్ జైపూర్ వెళ్లిన ఉదంతాలను ఆయన ఉదహరించారు.గత పదేళ్లుగా విదేశీ ప్రముఖులకు దేశ రాజధాని ఢిల్లీ వెలుపల ఆతిథ్యం ఇవ్వడం ఒక ఆనవాయితీగా మారిందని విదేశాంగ శాఖ ఇప్పటికే స్పష్టం చేసింది. స్పెయిన్ ప్రధానితో బరోడాలో, జర్మన్ ఛాన్సలర్‌తో అహ్మదాబాద్‌లో, మారిషస్ ప్రధానితో వారణాసిలో, అలాగే గోవాలో జరిగిన ఎస్‌సీవో విదేశాంగ మంత్రుల సదస్సులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.అక్టోబర్ 19, 20 తేదీల్లో ముంబైలో యూఏఈ, అమెరికా విదేశాంగ మంత్రులకు జైశంకర్ ఆతిథ్యం ఇచ్చారు. ఇదే క్రమంలో అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు.



డిండికి నీటి తరలింపు ఆపండి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు.సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు.పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రకృతితో ఘర్షణ వద్దు.. విపత్తులను తప్పించలేం: 'అలయ్ బలయ్'లో వెంకయ్యనాయుడు

(మొదటి పేజీ తరువాయి)

ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తుచేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే గొప్ప వేదిక 'అలయ్ బలయ్' అని ఆయన కొనియాడారు.ప్రతి సంవత్సరం దసరా పండుగ అనంతరం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సారథ్యంలో ఈ సాంస్కృతిక సమ్మేళనం జరుగుతోంది. ఈ వేడుకలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని సమైక్యతను చాటారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, లౌకిక దేశంలో ఏ మతాన్ని, పండుగను తక్కువ చేసి చూడకూడదని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' సాధనను దేశ ప్రజలందరూ తమ ఉమ్మడి జాతీయ లక్ష్యంగా మలుచుకోవాలని బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తెలిపారు. 'నషా ముక్త్ భారత్ - వికసిత్ భారత్' (మత్తుపదార్థాల రహిత - అభివృద్ధి చెందిన భారతదేశం) అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆహూతులను అలరించాయి.

'నోబెల్' రాలేదని అసంతృప్తి.. ఇప్పుడు 'పులిట్జర్' పైన కూడా!

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మరో అవార్డు కావాలట! యుద్ధాలు ఆపినందుకు నోబెల్ శాంతి బహుమతి రావాల్సిందని పదేపదే చెబుతున్న ఆయన.. ఇప్పుడు పులిట్జర్ పురస్కారంపైనా తనకు హక్కు ఉందంటున్నారు. నేను రాసిన రచనలకుగానూ ఆ అవార్డు రావాల్సిందని వ్యాఖ్యానించారు. దక్షిణ కరోలినాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.పెండిల్టన్‌లోని టీ.ఈడీ గారిసన్ అరేనాలో జరిగిన సభలో ట్రంప్ మీడియాపై విమర్శలు గుప్పించారు. రష్యా దర్యాప్తునకు సంబంధించిన కథనాలకు పులిట్జర్ అవార్డులు అందుకున్న జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకున్నారు. వారి కథనాలు తప్పుల తడకగా ఉన్నాయని ఆరోపించారు. ఆ అవార్డులు అందుకున్నవారికి అవి దక్కాల్సింది కాదని వ్యాఖ్యానించారు. తనకు నోబెల్ శాంతి బహుమతి రాలేదని, పులిట్జర్ కూడా ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన రచనలకుగానూ తనకు పులిట్జర్ రావాల్సిందని అన్నారు.ట్రంప్ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో పలువురు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రచనా నైపుణ్యంపై ఆయన చేసిన వాదనను ప్రశ్నించారు. ఇంగ్లిష్‌లో ఆయన మాట్లాడే తీరును ప్రస్తావిస్తూ సెటైర్లు వేశారు. పులిట్జర్ కోరుకోవడంపై కొందరు ఎగతాళి చేస్తూ పోస్టులు పెట్టారు.2026 పులిట్జర్ పురస్కారాల్లో ట్రంప్ ప్రభుత్వం, దాని విధానాలపై వచ్చిన కథనాలకు కూడా గుర్తింపు లభించింది. ఫెడరల్ ప్రభుత్వ విభాగాల్లో మార్పులు, ఉద్యోగాల కోతల ప్రభావంపై కథనాలకుగానూ వాషింగ్టన్ పోస్ట్ అవార్డు అందుకుంది. జెఫ్రీ ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌కు సంబంధించిన న్యాయశాఖ ఫైళ్ల విడుదలకు దోహదపడిన పరిశోధనాత్మక కథనాలకు వాల్ స్ట్రీట్ జర్నల్‌కు గుర్తింపు దక్కింది. షికాగోలో ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన కఠిన వలసల నిర్బంధ చర్యలపై కథనాలకు షికాగో ట్రిబ్యూన్‌కు అవార్డు దక్కింది.

మరో 30 ఏళ్లు మీకు అధికారం రాదు.. రాహుల్‌పై అమిత్ షా ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన రూ.8,941 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం అమిత్ షా ప్రసంగించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను మాట్లాడేది మీకు వినబడదని నాకు తెలుసు, మీరు ఎక్కడో విదేశాల్లో కూర్చున్నారు. ఎందుకు వెళ్లారో కూడా చెప్పరు, అది మీ వ్యక్తిగత విషయం.. కానీ ఢిల్లీకి తిరిగి వచ్చాక నా మాట వినండి, మరో 30 ఏళ్ల పాటు మీ వంతు రాదు" అని అమిత్ షా చురకలంటించారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ నాలుగు రోజుల పర్యటన నిమిత్తం వియత్నాంలో ఉన్నట్లు సమాచారం.ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, దీనిలో జ్ఞానేశ్ కుమార్ పాత్ర ఉందని ఆరోపిస్తూ ఇండియా కూటమి పార్టీలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ విదేశీ పర్యటనకు వెళ్లడంపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలో నిరసనల్లో అబద్ధాలు చెప్పి అలసిపోయి, రాహుల్ విహారయాత్రకు వెళ్లారని బీజేపీ ఎద్దేవా చేసింది. ఆయన వియత్నాం విమానంలో ఉన్నట్లుగా చెబుతున్న ఒక వీడియోను 'ఎక్స్'లో షేర్ చేస్తూ.. "రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వెనుక ఉన్న అజెండా ఏమిటి?" అని ప్రశ్నించింది.ఇదే అంశంపై బీజేపీ నేత సంబిత్ పాత్రా మాట్లాడుతూ.. పాలన మార్పునకు కుట్ర పన్నుతున్నారని, జార్జ్ సోరోస్ నుంచి క్లాసులు తీసుకోవడానికే రాహుల్ విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నేత విరామం కోసం విదేశాలకు వెళుతున్నారా? లేక తన అరాచక సహాయకారులను కలవడానికి వెళుతున్నారా? అని మరో బీజేపీ నేత ప్రదీప్ భండారీ ప్రశ్నించారు.ఈ సందర్భంగా విపక్షాల ఓట్ల దొంగతనం ఆరోపణలను కూడా అమిత్ షా తిప్పికొట్టారు. చాలా రాష్ట్రాల్లో దశాబ్దాలుగా ప్రతిపక్షాలు అధికారంలో లేకుండా పోయాయని గుర్తుచేశారు. "నిరసనలు, ప్రదర్శనలతో ఏమీ సాధించలేరు. మీరు ఎక్కడైతే ఎన్నికయ్యారో అక్కడ ప్రజల కోసం ప్రణాళికలు తీసుకురండి" అని విపక్షాలకు హితవు పలికారు.

సూపర్ ఎల్‌నినో వచ్చినా విద్యుత్ కొరత రావొద్దు

సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, అక్టోబరు 22 :

ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున కొరత రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో వచ్చినా సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. వ్యవసాయ, గృహ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో రోజుకు 140 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్దేశించారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిలు తదితర అంశాలపై ఆ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క గురువారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సగటున 91 మిలియన్ యూనిట్లకు చేరిందని, ఈ నెల 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేశామని జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్ వివరించారు. దీన్ని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని భట్టి సూచించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా బొగ్గు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వచ్చే నెల నుంచి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. యాదాద్రి విద్యుత్ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించామని అధికారులు తెలిపారు. మిగిలిన సాంకేతిక, నిర్వహణాపరమైన సమస్యలను పరిష్కరించి పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి త్వరలోనే తీసుకొస్తామని చెప్పారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com
అక్టోబర్ | శుక్రవారం | 23 | 2026

హైదరాబాద్ వైద్య పర్యాటక రంగంపై పరిశోధన.. కేయూ విద్యార్థి గొల్లపూడి సుధీర్‌కు డాక్టరేట్!

వ్యాపార వ్యూహాలు, మార్కెట్ ధోరణులపై సమగ్ర అధ్యయనం.. పరిశోధనకు ఆచార్య టి. మనోహర్ పర్యవేక్షణ

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి: మారెల్లి కిరణ్):

కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం పరిశోధక విద్యార్థి గొల్లపూడి సుధీర్‌కు డాక్టరేట్ (పీహెచ్‌డీ) లభించింది. ఈ విషయాన్ని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్ కట్ల అధికారికంగా ప్రకటించారు.ఆచార్య టి. మనోహర్ పర్యవేక్షణలో సుధీర్ 'హైదరాబాద్ వైద్య పర్యాటక రంగంలో వ్యాపార వ్యూహాలు, మార్కెట్ ధోరణులు' అనే అంశంపై సమగ్ర పరిశోధన చేసి, పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. వైద్య పర్యాటక రంగంలోని వ్యాపార వ్యూహాలు, మార్కెట్ పరిణామాలను అధ్యయనం చేస్తూ ఆయన ఈ పరిశోధన చేపట్టారు.కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన గొల్లపూడి సుధీర్ పీహెచ్‌డీ పట్టా సాధించడం పట్ల కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు, మిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



కేయూ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా కొమరం భీమ్ జయంతి

- **గిరిజన హక్కుల కోసం భీమ్ పోరాటం స్ఫూర్తిదాయకం.. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి: మారెల్లి కిరణ్):

హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జల్, జంగల్, జమీన్ నినాద స్ఫూర్తి ప్రదాత, గిరిజన హక్కుల పోరాట యోధుడు కొమరం భీమ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం కొమరం భీమ్ సాగించిన వీరోచిత పోరాటం సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.నేటి యువత, విద్యార్థులు కొమరం భీమ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, ఉన్నత మానవీయ విలువలను నిత్యజీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,



విద్యార్థులు పాల్గొని కొమరం భీమ్‌కు నివాళులర్పించారు.

జనగణన-2027 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- **ఎన్యూమరేషన్ బ్లాకుల విభజనపై సమీక్ష.. అధికారులకు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశాలు**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి)

రాబోయే జనగణన-2027 ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. గురువారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కార్యాలయంలో ఎన్యూమరేషన్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ బ్లాకుల విభజన ప్రక్రియను కలెక్టర్ సమీక్షించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి పనిభారం సమానంగా ఉండేలా విధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. జనగణనలో భాగంగా వివరాల సేకరణ సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జనగణన ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముందస్తు ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేసి జనగణన ప్రక్రియ విజయవంతమయ్యేలా



చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ తి. వెంకన్నతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న జయంతి

- **వీరయోధుడి ధైర్యసాహసాలు, సేవలు చిరస్మరణీయం.. నివాళులర్పించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీరయోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథిగా హాజరై పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వక్తలు పండుగ సాయన్న జీవిత విశేషాలను స్మరించుకున్నారు. సమాజ శ్రేయస్సు కోసం, పీడిత ప్రజల పక్షాన నిలిచి ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు, అందించిన నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సమాజంలో సమానత్వం, సేవాభావం, ధైర్యసాహసాల విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని వక్తలు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) శ్రీనివాస్, మేర కార్పొరేషన్



చైర్మన్ సంగు వెంకట్రాజుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం

- **రక్షణ పరికరాలను తప్పనిసరిగా ధరించి విధులు నిర్వహించాలి.. జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారిణి చాహత్ బాజ్‌పాయ్**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ప్రాణ రక్షణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ప్రత్యేక అధికారిణి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ తి. వెంకన్నతో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ పరికరాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్మికులకు నూతన యూనిఫారాలు, ఏప్రాన్లు, ప్రత్యేక బూట్లు, గ్లౌజులను అందజేశారు. విధి నిర్వహణలో కార్మికులు తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాల బారిన పడకుండా పంపిణీ చేసిన రక్షణ పరికరాలను తప్పనిసరిగా ధరించి పనులు చేపట్టాలని సూచించారు.పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, వారికి అవసరమైన రక్షణ సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికుల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.



దసరా వేళ ఉమ్మడి వరంగల్‌లో మద్యం అమ్మకాల జోరు

- **మూడు రోజుల్లో రూ.86.14 కోట్ల విక్రయాలు.. 60,904 లిక్కర్ కేసులు, 1,71,903 బీర్ కేసుల అమ్మకం**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



విజయదశమి పండుగ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మద్యం విక్రయాలు భారీగా నమోదయ్యాయి. అక్టోబర్ 17, 19, 21 తేదీల్లో కేవలం మూడు రోజుల్లోనే రూ.86.14 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తురాజ్ గౌడ్ వెల్లడించారు.జిల్లాల వారీగా విక్రయాలను పరిశీలిస్తే హనుమకొండ జిల్లాలో అత్యధికంగా రూ.26.62 కోట్ల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. వరంగల్ జిల్లాలో రూ.15.56 కోట్లు, జనగామ జిల్లాలో రూ.15.78 కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో రూ.15.86 కోట్లు, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో కలిపి రూ.12.32 కోట్ల విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.మొత్తంగా ఈ మూడు రోజుల్లో 60,904 లిక్కర్ కేసులు, 1,71,903 బీర్ కేసులు అమ్ముడైనట్లు వెల్లడించారు. పండుగ సందర్భంగా మద్యం విక్రయాలు భారీగా జరగడం ఉమ్మడి వరంగల్‌లో చర్చనీయాంశంగా మారింది.

హనుమకొండలో రేపు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

- **విద్యుత్ లైన్ల అభివృద్ధి పనులతో రెండు విడతల్లో కరెంట్ నిలిపివేత**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల ప్రతినిధి):



హనుమకొండలో విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల నేపథ్యంలో శుక్రవారం (అక్టోబర్ 23) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టనున్న అత్యవసర విద్యుత్ లైన్ల అభివృద్ధి పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరిమళ కాలనీ, సప్తగిరి కాలనీ, పోలీస్ కాలనీ, పూరిగుట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ జి. సాంబారెడ్డి తెలిపారు.అదేవిధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నేహనగర్, పింగిళి జూనియర్ కళాశాల, బల్లయ్య హోటల్, రాఘవేంద్ర నగర్, శ్రీనగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అభివృద్ధి పనులకు సహకరించాలని ఆయన కోరారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం చేయాలి

- **429 పోస్టుల భర్తీలో సర్వీసులను పరిగణనలోకి తీసుకోవాలి.. కేయూ రిజిస్ట్రార్‌కు వినతి**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



తెలంగాణ రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాల పరిధిలో భర్తీ చేయనున్న 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకుల సర్వీసులను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కాకతీయ యూనివర్సిటీ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై. రాంబాబు డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రామచంద్రంకు సంఘం ప్రతినిధులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. అర్హులైన పార్ట్‌టైం అధ్యాపకులకు తక్షణమే సర్వీస్ రాటిఫికేషన్ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు.దీనిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను వైస్‌ఛాన్సలర్ (వీసీ) దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ఉన్నత విద్యామండలితో సంప్రదింపులు జరిపి, పార్ట్‌టైం అధ్యాపకులకు తగిన న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

డిసెంబరులో హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో ఖేలో ఇండియా అథ్లెటిక్స్ పోటీలు!

- **ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్.. మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులకు ఆదేశాలు**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి:):



హనుమకొండలోని చారిత్రక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) వేదికగా రానున్న డిసెంబర్‌లో ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం పరిశీలించారు.దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. క్రీడాకారులకు మెరుగైన వసతి, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.స్టేడియంలో ప్రస్తుతం కొనసాగుతున్న నవీకరణ, నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేసి, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

భూపాలపల్లి డీఆర్‌డీఏలో లంచం ఆరోపణల కలకలం

- **రూ.39.14 లక్షల నిధుల బదిలీ వ్యవహారం.. పీవో, టెక్నికల్ ఆఫీసర్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ**



హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి:):

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) కార్యాలయంలో లంచం ఆరోపణలు కలకలం రేపాయి. పీఎం కృషి సించాయ్ యోజన పనులకు సంబంధించి రూ.39.14 లక్షల నిధుల బదిలీ వ్యవహారంలో అధికారులు లంచం డిమాండ్ చేశారనే ఫిర్యాదు ఏసీబీకి అందింది.ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి (పీవో) సతీష్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రాజులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం.ఇదిలా ఉండగా, సుమారు రూ.1.62 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల రికార్డులను సైతం ఏసీబీ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. నిధుల బదిలీ, లావాదేవీలకు సంబంధించిన వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కొత్తపల్లిలో రైతులకు పత్తి కొనుగోలు, యాసంగి పంటలపై అవగాహన

- ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలి..
- రైతులకు వ్యవసాయ అధికారుల సూచనలు

భీమదేవరపల్లి, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):

భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి రైతు వేదికలో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తి కొనుగోలు సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎల్నినో ప్రభావం నేపథ్యంలో యాసంగి సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు పలు సూచనలు చేశారు.కేంద్ర ప్రభుత్వ 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించిన సందర్భంగా ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగు, పత్తి నాణ్యత, కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించారు. పత్తి విక్రయాల సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, కొనుగోలు ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఎల్నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని యాసంగి పంటల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొక్కల ప్రవంతి రెడ్డి, వ్యవసాయ అధికారి పద్మ, మార్కెట్ కమిటీ సభ్యులు, సాయినగర్ సర్పంచ్ మైకాల వెంకన్న, క్లస్టర్ ఏఈఓలు క్రిసొలైట్, నాగరాజు, కమలహాసన్, అరవింద్, మౌనికతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో సరికొత్త మోసం..

'QVSE' యాప్‌పై అప్రమత్తంగా ఉండాలి!

రూ.54 వేల పెట్టుబడితో రోజుకు 1 శాతం లాభమంటూ మోసం..

ప్రజలకు వరంగల్ సీపీ ఎన్. శ్వేత హెచ్చరిక

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



ఆన్‌లైన్ పెట్టుబడుల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 'ఖుఖూజు' మొబైల్ యాప్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత హెచ్చరించారు. అధిక లాభాల ఆశ చూపుతూ సైబర్ నేరగాళ్లు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు.రూ.54 వేలు పెట్టుబడి పెడితే రోజుకు 1 శాతం లాభం వస్తుందని, ఇతరులను రిఫర్ చేస్తే అదనపు ఆదాయం లభిస్తుందని నమ్మిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ తరహా మోసాలకు సంబంధించి ఇప్పటికే తెలంగాణవ్యాప్తంగా 56 కేసులు నమోదైనట్లు వెల్లడించారు.తెలియని వ్యక్తులు పంపించే అనుమానాస్పద ఏపీకే (ఖుఖూ) ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేయవద్దని సీపీ సూచించారు. అనధికారిక యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం ద్వారా వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, ఆన్‌లైన్‌లో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

హుజూర్‌నగర్‌లో ఇంట్లో చోరీ.. రూ.2.40 లక్షల

విలువైన ఆభరణాలు అపహరణ!

- ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఘాతుకం.. గుర్తుతెలియని వ్యక్తుల కోసం పోలీసుల గాలింపు

హుజూర్‌నగర్, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):





హుజూర్‌నగర్ పట్టణంలో ఇంట్లో చోరీ జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని సాయిబాబా థియేటర్ రోడ్డులో నివాసముంటున్న బూర్గం వెంకటేశ్వర్లు ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు, వెండి ఆభరణాలతో పాటు విలువైన వస్తువులను అపహరించారు.ఈ నెల 16 నుంచి 22వ తేదీ మధ్య వెంకటేశ్వర్లు ఇంట్లో లేని సమయంలో ఈ చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అపహరణకు గురైన బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువుల మొత్తం విలువ సుమారు రూ.2.40 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

మైనారిటీ యువతకు నిట్‌లో ఉచిత సాంకేతిక శిక్షణ

- 600 మందికి అవకాశం.. నెలకు రూ.1,000 స్టైఫండ్‌తో పాటు ఉచిత వసతి, భోజనం

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



కేంద్ర ప్రభుత్వ పీఎం వికాస్ పథకం కింద వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో 600 మంది మైనారిటీ యువతకు ఉచిత సాంకేతిక, నైపుణ్య శిక్షణ అందించనున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ శిక్షణలో భాగంగా సీఎన్‌సీ (CNC), క్యాడ్/క్యామ్ (CAD/CAM), వెల్డింగ్, కన్స్ట్రూమర్ డ్యూరబుల్స్ విభాగాల్లో 3 నుంచి 4 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత హాస్టల్ వసతి, భోజన సదుపాయాలతో పాటు నెలకు రూ.1,000 చొప్పున స్టైఫండ్ అందజేయనున్నట్లు వెల్లడించారు. 18 నుంచి 45 ఏళ్ల వయస్సు గల అర్హులైన అభ్యర్థులు నవంబర్ 2వ తేదీలోగా ఆన్‌లైన్ గూగుల్ ఫామ్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రతినిధులు కోరారు.

కాకతీయ యూనివర్సిటీలో 64 పీహెచ్‌డీ సీట్లు

- సైన్స్ విభాగాల్లో ప్రవేశాలకు అవకాశం.. దరఖాస్తులకు అక్టోబర్ 24 చివరి తేదీ

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం మొత్తం 64 ఖాళీలు అందుబాటులో ఉన్నట్లు సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ బి. వెంకట్రాంరెడ్డి వెల్లడించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విశ్వవిద్యాలయంలోని బాటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, జువాలజీ తదితర సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 24వ తేదీలోగా కాకతీయ విశ్వవిద్యాలయం సైన్స్ ఫ్యాకల్టీ డీన్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. గడువులోగా దరఖాస్తు చేసుకుని పీహెచ్‌డీ ప్రవేశ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



వంగర నూతన ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన ముల్కనూర్ వాసులు

- సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐకి శుభాకాంక్షలు

భీమదేవరపల్లి, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐని ముల్కనూర్ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల శ్రీకాంత్, మండల వైస్ ప్రెసిడెంట్ గుడిగందుల రాజు, ముల్కనూర్ 8వ వార్డు సభ్యుడు, మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ చిటుకూరి అనిల్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకుడు చిటుకూరి నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూర్‌లో ఘనంగా పండుగ సాయన్న, కొమరం భీమ్ జయంతి వేడుకలు

- మహనీయుల పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి.. యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్

భీమదేవరపల్లి, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):



అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన వీరయోధులు పండుగ సాయన్న, కొమరం భీమ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్ పిలుపునిచ్చారు. భీమదేవరపల్లి మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో పండుగ సాయన్న, కొమరం భీమ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అణచివేతకు గురైన వర్గాల హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవం, సమానత్వం కోసం వారు సాగించిన పోరాటాలను స్మరించుకున్నారు. వారి త్యాగాలు, పోరాటాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జక్కుల అనిల్ యాదవ్ మాట్లాడుతూ.. మహనీయుల పోరాట స్ఫూర్తిని యువత స్ఫూర్తిగా తీసుకుని, కులమత భేదాలు లేని సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సామాజిక న్యాయం సాధనతో పాటు అణగారిన వర్గాల అభ్యున్నతికి అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉషాకోయిల ప్రకాష్, బొజ్జపురి అశోక్ ముఖర్జీ, ఆదరి రవీందర్, పొన్నాల మురళి, డబ్బా శంకర్, శ్రీరామోజు సమ్మయ్య, మాడుగుల గోపి, కాసగోని బాలకృష్ణ, తల్లా సదానందం, వెంకన్న, మాడుగుల కొమురయ్య, పూర్ణచందర్, వొల్లాల రమేష్, కిషోర్, తాకిల్ పాషా, పొన్నాల మధుసూదన్ రెడ్డి, కూన దేవరాజు, బొల్లంపల్లి షెడ్రక్, సదానందం, మొండయ్య, మాడుగుల యాదగిరి, సికా ప్రభాకర్, నాగరబోయిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.అలాగే సర్పంచులు మేకల వెంకన్న, డప్పు శ్రీనివాస్, కాలేరు శ్రవణ్, యువజన కాంగ్రెస్ నాయకులు పోగుల శ్రీకాంత్, గుడికందుల రాజు, మాడుగుల చింటూ, బొల్లంపల్లి రంజిత్, చిలుకూరి నితిన్, నిఖిల్, ఎల్దీ వినోద్, రాకేష్, అజయ్, రెనా ప్రవీణ్ పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు ఆదరి స్వప్న, అన్నపూర్ణమ్మ, శోభతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ శ్వేతా రెడ్డి


- స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి.. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి
- రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరా

వరంగల్, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి: మారెల్లి కిరణ్):

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.బుధవారం ఉదయం 11:40 గంటల నుంచి మధ్యాహ్నం 12:40 గంటల వరకు పోలీస్ స్టేషన్‌లో పర్యటించిన సీపీ.. స్టేషన్ లోపలి, బయటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విధుల నిర్వహణ, రికార్డుల భద్రత, నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

ఈ సందర్భంగా ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌కు సీపీ పలు సూచనలు చేశారు. మన ఇంటిని పరిశుభ్రంగా ఉంచుకున్నట్లుగానే పోలీస్ స్టేషన్ పరిసరాలను కూడా ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సావధానంగా వినాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు పోలీస్ స్టేషన్‌లో సానుకూల వాతావరణం కల్పించాలని సూచించారు.ఈ తనిఖీలో హనుమకొండ ఏసీపీ ఇన్‌చార్జి నర్సింగరావుతో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హనుమకొండలో మహిళలకు ప్రత్యేక జాబ్ మేళా

- 50 పోస్టుల భర్తీకి అక్టోబర్ 24న ఇంటర్వ్యూలు.. నెలకు రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తంజ్వాల ప్రతినిధి:):

నిరుద్యోగ మహిళలకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించే లక్ష్యంతో హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 24న ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించనున్నారు. ప్రముఖ ధ్రువంత్ సొల్యూషన్స్ సంస్థలో ఖాళీగా ఉన్న 50 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు చేపట్టనున్నారు.ఈ ఉద్యోగాలకు 20 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని నిర్వాహకులు తెలిపారు. ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు టీమ్ లీడర్, టెలీ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు.ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.13,000 నుంచి రూ.18,000 వరకు వేతనంతో పాటు అదనపు ఇన్సెంటివ్స్ అందించనున్నట్లు తెలిపారు.అర్హత, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో వరంగల్‌లోని మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)లో సంప్రదించాలని ఉపాధి కల్పన అధికారులు సూచించారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతి చిన్నారి బడిబాట పట్టాలి..

తల్లిదండ్రులకు అవగాహన

- పాఠశాలల పునఃప్రారంభంపై కెరమెరి మండల గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు

కెరమెరి, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):

దసరా సెలవుల అనంతరం ఈ నెల 23న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించేందుకు కెరమెరి మండలంలోని కొలం ఝరి, గోండ్ ఝరి, సాకాడ-బి, హట్టి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని, విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా, క్రమం తప్పకుండా బడికి హాజరయ్యేలా చూడాలని నిర్వాహకులు సూచించారు. విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా నాయకుడు మడావి భరత్ భూషణ్, ఉపాధ్యాయుడు చి. సంజీవ్ కుమార్, పేసా మొబిలైజర్లు కె. వెంకట్ రావు, అడా ఆనంద్ రావు, కె. యాదోరావు, కె. పాండు, గ్రామ పటేళ్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సూర్యాపేట కలెక్టరేట్‌లో ఘనంగా పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలు





- **నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా వీరుడు పండుగ సాయన్న: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):

నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, నిరుపేదల ఆకలి తీర్చిన ప్రజా వీరుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పండుగ సాయన్నను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలుస్తారని తెలిపారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతూ, అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆయన కృషి చేశారని పేర్కొన్నారు. నిజాం పాలకుల ధాన్యాగారాలను కొల్లగొట్టి, ఆ ధాన్యాన్ని పేదలకు పంచిపెట్టేవారని వివరించారు. ధనవంతులు, పెట్టుబడిదారులు, భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు.

నిరుపేదల పక్షాన నిలిచిన ప్రజా వీరుడు

మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన పండుగ సాయన్న చిన్నతనం నుంచే దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని కలెక్టర్ తెలిపారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం సాగిస్తూ, పేదల పక్షాన నిలిచిన గొప్ప ప్రజా వీరుడని ప్రశంసించారు.

అధికారులు, బీసీ సంఘాల నాయకులు హాజరు

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీవో శ్రీరామ్‌తో పాటు బీసీ సంఘాల నాయకులు ఈదుల యాదగిరి, కళా కరుణాకర్, కందుల రమేష్, చలమల నరసింహ, బూర మాల్సూర్ గౌడ్, పి. వీరాచారి, డాక్టర్ కృష్ణ, తన్నీరు రాం ప్రభువు, మామిడి వెంకటేశ్వర్లు, దున్న శ్యాం తదితరులు పాల్గొన్నారు.

రౌట సంకెపల్లిలో ఘనంగా కొమురం భీం, ఎడ్ల కొండు జయంతి వేడుకలు

- **ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం వారి పోరాటం చిరస్మరణీయం: డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క**
- **ఈ నెల 26న జోడేఘాట్‌లో జరిగే వర్ధంతి వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు**

ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):

ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వయం పాలన కోసం పోరాడిన వీర యోధులు కొమురం భీం, ఎడ్ల కొండుల జయంతి వేడుకలను గురువారం వారి పురిటిగడ్డ రౌట సంకెపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క హాజరై, వారి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.గ్రామానికి చేరుకున్న ఆత్రం సుగుణక్కకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం డోలు వాయిద్యాల నడుమ స్థానికులు ఘన స్వాగతం పలికారు.ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషిఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసీలలో చైతన్యం నింపిన కొమురం భీం, ఎడ్ల కొండుల పోరాటం చిరస్మరణీయమని అన్నారు. వారి త్యాగాలు, పోరాట స్ఫూర్తి ఆదివాసీ సమాజానికి ఎప్పటికీ ఆదర్శమని పేర్కొన్నారు.కొమురం భీం స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. గిరిజనుల భూములు, అటవీ హక్కులు, విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కొమురం భీం, ఎడ్ల కొండుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.జోడేఘాట్ వర్ధంతి వేడుకలకు తరలిరావాలిఈ నెల 26న జోడేఘాట్‌లో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న కొమురం భీం, ఎడ్ల కొండుల వర్ధంతి వేడుకలకు ఆదివాసీ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆత్రం సుగుణక్క కోరారు.

పలువురు ప్రముఖుల హాజరు



ఈ కార్యక్రమంలో డీటీడీఓ జాదవ్ అంబాజీరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఏసీఎంఓ పూర్కా ఉదవ్, మాజీ మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్రం ఈశ్వరి బాయి, స్థానిక సర్పంచ్ ఆత్రం కొండూ, సర్పంచ్‌లు బుర్స పోచయ్య, టేకం గంగారాం, గొండ్వానా జాతీయ నాయకులు సిదం అర్జున్, కొలం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్‌రావు, కొలం సూరు మనుమడు పండు, రాజ్‌గోండ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెందోర్ సుధాకర్, నాయకులు చాహకటి దర్శు, వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సిదం తిరుపతి, మహిళా నాయకురాలు విజయ, సిదం జగన్నాథరావు, ఉపాధ్యాయ నాయకులు జనక ప్రసాద్ సాయి, కృష్ణ, పూర్కా మాణిక్‌రావు, కనక వెంకటేశ్వర్, కొలం సంఘం నాయకులు అన్నిగా, తుడుం దెబ్బ నాయకులు, రాయి సెంటర్ నాయకులు, వేడుకల నిర్వహణ కమిటీ సభ్యులు, ఆదివాసీ ప్రజలు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా.. నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు!

రూ.8.37 కోట్లతో నిర్మాణం.. చెత్త నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం?

తడి, పొడి చెత్త వేరు చేసే లక్ష్యం నీరుగారుతోందా?

ఆసిఫాబాద్, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి.. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.. చెత్త నుంచే సేంద్రియ ఎరువులు తయారు చేసి గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలి.. ఇదీ సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం. కానీ క్షేత్రస్థాయిలో నిర్వహణ లోపాలతో ఈ లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చెత్త నిర్వహణ కోసం నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు ఆశించిన స్థాయిలో వినియోగంలోకి రాకపోవడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

రూ.8.37 కోట్లతో నిర్మాణాలు.. ఫలితాలేవీ?

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో ఒక్కో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల చొప్పున వెచ్చించారు. ఈ లెక్కన మొత్తం రూ.8.37 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేసి విక్రయించడం ద్వారా పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నది ఈ ప్రాజెక్టు ఉద్దేశం.అయితే నిర్వహణపై తగిన శ్రద్ధ లేకపోవడంతో పలు చోట్ల చెత్త పేరుకుపోతుండటం, పరిసరాల్లో కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాకపోతే వాటి నిర్మాణం వెనుక ఉన్న ప్రయోజనం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పర్యవేక్షణ ఏదీ.. బాధ్యత ఎవరిది?

చెత్త సేకరణ నుంచి వేరు చేయడం, ఎరువుల తయారీ, విక్రయం వరకు నిరంతర నిర్వహణ అవసరం. షెడ్లు నిర్మించడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటి పనితీరుపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు గ్రామాల్లో చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టడంతో పాటు, వినియోగంలో లేని షెడ్లను గుర్తించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రజాధనంతో నిర్మించిన ఈ వసతులు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



హనుమకొండలో బాలికల భద్రతపై ఆందోళన.. రెండేళ్లలో 127 మంది పోక్సో బాధితులు!

- **2024 నుంచి 2026 సెప్టెంబర్ వరకు నమోదైన కేసులు.. తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆందోళన**

హనుమకొండ, అక్టోబర్ 22 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి:):

హనుమకొండ జిల్లాలో బాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించిన ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారిక గణాంకాల ప్రకారం, 2024 నుంచి 2026 సెప్టెంబర్ వరకు జిల్లాలో 127 మంది బాలికలు పోక్సో (ఫూజూూ) కేసుల్లో బాధితులుగా నమోదైనట్లు వెల్లడైంది. వీటిలో ఇటీవల కాలంలోనే 62 కేసులు నమోదైనట్లు సమాచారం.వరుస ఘటనల నేపథ్యంలో బాలికల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్నారుల రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రక్షణ చర్యలు పటిష్ఠం చేయాలి

బాలికల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పోలీస్, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని నిపుణులు, సామాజికవేత్తలు సూచిస్తున్నారు. పాఠశాలలు, పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, బాలలపై వేధింపుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించే వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

'నా వైఫ్ మిస్సింగ్': చాలా ఏళ్ల తర్వాత మళ్లీ వరుణ్‌తో.. శ్వేతాబసు ప్రసాద్ ఆనందం

- **'నా వైఫ్ మిస్సింగ్'తో తెలుగులోకి రీఎంట్రీ ఇచ్చిన నటి**
- **ఇది తనకు గొప్ప కమ్‌బ్యాక్ అని వ్యాఖ్యానించిన శ్వేత**
- **'కొత్త బంగారు లోకం' తర్వాత మళ్లీ వరుణ్ సందేశ్‌తో కలిసి నటించడంపై సంతోషం**
- **తెలుగు చిత్ర పరిశ్రమలోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్లుందని వెల్లడి**



'కొత్త బంగారు లోకం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించిన నటి శ్వేతా బసు ప్రసాద్, సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ తెలుగు తెరపైకి పునరాగమనం చేశారు. 'ఆహా' ఓటీటీ వేదికగా రూపొందిన 'నా వైఫ్ మిస్సింగ్' అనే వెబ్ సిరీస్ ద్వారా ఆమె రీఎంట్రీ ఇచ్చారు. ఇది తనకు లభించిన ఒక అద్భుతమైన అవకాశమని, తిరిగి టాలీవుడ్‌లోకి రావడం సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.ఈ సిరీస్ ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్వేతా బసు ప్రసాద్ మాట్లాడుతూ, "చాలా ఏళ్ల తర్వాత మళ్లీ తెలుగులో నటించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ వెబ్ సిరీస్ నా కెరీర్?కు మంచి పునరాగమనం అవుతుందని భావిస్తున్నాను. ఇందులో నేను పోషించిన 'స్వప్న' అనే పాత్ర ఎంతో శక్తిమంతంగా ఉండటంతో వెంటనే నటించడానికి అంగీకరించాను" అని పేర్కొన్నారు. 'కొత్త బంగారు లోకం' తర్వాత మళ్లీ వరుణ్ సందేశ్‌తో కలిసి పనిచేయడంపై స్పందిస్తూ, "వరుణ్ నా సోల్ మేట్. ఇన్నేళ్ల తర్వాత మళ్లీ అతనితో కలిసి నటించడం ఒక మధురానుభూతి" అని అన్నారు.గత కొన్నేళ్లుగా తెలుగు చిత్ర పరిశ్రమకు దూరంగా ఉన్న శ్వేతా బసు ప్రసాద్, ప్రధానంగా హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లపై దృష్టి కేంద్రీకరించారు. దర్శకురాలు స్వాతి అంకితభావంతో పనిచేసే వ్యక్తి అని, ఆమెతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని శ్వేత తెలిపారు. ఈ అవకాశం కల్పించిన 'ఆహా' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రేక్షకులందరూ ఈ సిరీస్?ను ఆదరిస్తారని ఆకాంక్షించారు. కాగా, ఈ వెబ్ సిరీస్ ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళ భాషలోనూ 'ఆహా' ఓటీటీలో అందుబాటులో ఉంది.

పెళ్లి పీటలెక్కనున్న 'హనుమాన్' హీరో.. తేజ సజ్జా వివాహ ముహూర్తం ఫిక్స్!

- **డిసెంబర్‌లో తేజ సజ్జా వివాహం**
- **ఉదయ్‌పూర్‌లో పెళ్లి వేడుక, హైదరాబాద్‌లో రిసెప్షన్**
- **నవంబర్‌లో నిశ్చితార్థం**
- **పెద్దలు కుదిర్చిన వివాహమని వెల్లడి**
- **టెక్నాలజీ రంగానికి చెందిన వధువు**

టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో పెళ్లి చేసుకోబోతున్నాడు. డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన వివాహం జరగనున్నట్లు వెల్లడించాడు. నవంబర్‌లో నిశ్చితార్థం నిర్వహించి, ఆ తర్వాతి నెలలో పెళ్లి వేడుక జరగనుంది. తనది పెద్దలు కుదిర్చిన వివాహమని, తల్లిదండ్రులే సంబంధం ఖరారు చేశారని తేజ తెలిపాడు.తన వ్యక్తిగత జీవితాన్ని ఎప్పుడూ గోప్యంగా ఉంచే తేజ.. పెళ్లి వేడుకను కూడా నిరాడంబరంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఉదయ్‌పూర్‌లో వివాహం అనంతరం హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహించనున్నారు.తనకు కాబోయే భార్య కుటుంబానికి సినీ పరిశ్రమతో ఎలాంటి సంబంధాలు లేవని తేజ వెల్లడించాడు. వారు టెక్నాలజీ రంగంలో ఉన్నారని, ఆమె ప్రస్తుతం తన తండ్రితో కలిసి పనిచేస్తోందని చెప్పాడు. అమెరికాలో పెరిగిన ఆమెకు సినీ ప్రముఖుల ప్రపంచం, ప్రచార హడావుడి గురించి పెద్దగా పరిచయం లేదని తెలిపాడు. ఆ విషయం తనకు బాగా నచ్చిందని, పెళ్లి తర్వాత కూడా ఆమె వ్యక్తిగత జీవితానికి గోప్యత ఉండేలా చూసుకోవాలనుకుంటున్నట్లు పేర్కొన్నాడు.తనకు కాబోయే భార్య వివరాలను మాత్రం తేజ వెల్లడించలేదు. ఆమె వ్యక్తిగత గోప్యతను కాపాడాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.'హనుమాన్' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా.. ఆ తర్వాత 'మిరాయ్'తోనూ ప్రేక్షకులను అలరించాడు. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ వ్యక్తిగత జీవితాన్ని మాత్రం కెరీర్‌కు దూరంగా ఉంచుతున్నాడు. ప్రస్తుతం ఆయన ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న 'ది ట్రైటర్స్ తెలుగు' తొలి సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు.

